
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 25 మార్చి 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
కడప	6.31	5.01
ప్రొద్దుటూరు	6.32	5.05



- కడపలో వైసీపీ హయాంలో నయా దోపిడీకి స్కెచ్
- ప్రభుత్వం మారినా అదే దందా కొనసాగింపు
- ఇప్పుడు కలెక్షన్లకు అధికార పార్టీ నేతల ఎంట్రీ

ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా...!

ఐదేళ్ల వైసీపీ హయాంలో పంచభూతాల్లో గాలిని తప్ప అన్నింటినీ స్వాహా చేశారు. అధికారాన్ని ఎంత దుర్వినియోగం చేయవచ్చో ఆ ప్రభుత్వంలో నిరూపించారు. పథకాల పేరుతో జనాలకు పప్పులు బెల్లాలు పంచి కొందరు భారీగా వెనకేసుకున్నారు. కాంట్రాక్టు పనులు, బిజినెస్‌లు చేసి సంపాదించడం తప్పులేదు. కానీ కొందరు నేతలు ఏకంగా ప్రభుత్వ రోడ్ల మీదనే ట్యాక్స్ విధిస్తున్నారు. టీ అంగళ్లు, టిఫిన్‌సెంటర్లు, తోపుడుబండ్ల నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేసి నయా ట్రెండ్‌కు తెరలేపారు. ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా.. అంటూ చిరువ్యాపారుల నుంచి కప్పం కట్టించుకుంటున్నారు.

- కార్పొరేటర్లు.. అధికార పార్టీ నేతల ట్యాక్స్
- టిఫెన్ బండ్లు, టీ అంగళ్ల నుంచి నెలనెలా కలెక్షన్లు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ముగిసి కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతోంది. అయినా అదే నీచ సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతుండడం గమనార్హం.
పైసా పెట్టుబడి లేకుండానే కేవలం వారు ప్రాతినిథ్యం వహించే ఏరియా అనే కారణంతో రోడ్ల వెంబడి తోపుడు బండ్ల మీద వ్యాపారం చేసే వారి నుంచి డబ్బులు నెలనెలా వసూలు చేస్తున్నారు. అయితే లేటెస్ట్‌గా కొందరు టీడీపీ నేతలు కూడా ఆ డివిజన్లలో ఎంటర్ అయి వ్యాపారుల నుంచి నెలనెలా కప్పం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్థలాలనే సాకు చూపి వ్యాపారుల నుంచి మామూళ్ల వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆదాయం ప్రభుత్వానికి వెళ్లకుండా వారి జేబుల్లోకి వెళుతుండడంతో పలు విమర్శలు వస్తున్నాయి. గతంలో కమిషనరు సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు రాజీవ్‌పార్కు ఏరియాలో 52 బండ్లు పెట్టుకునేందుకు మార్కింగ్ ఇచ్చారు. ఒక్కో బాక్స్‌కు రూ.2వేలు చొప్పున అప్పట్లో కార్పొరేషనుకు చెల్లించేవారు. దీంతో ఆదాయం సమకూరేది.

కప్పం కట్టాల్సిందే

కడప కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లున్నాయి. కడప నగరం ఇటీవల బాగా విస్తరిస్తుంది. ప్రముఖ కార్పొరేట్ సంస్థలన్నీ వాటి బ్రాంచ్‌లను కడపలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో షాపింగ్‌మాల్స్ సంఖ్య పెరిగిపోతుంది. వివిధ ప్రాంతాల నుంచి కడపకు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతుంది. ఇక కరోనా తరువాత మన లైఫ్‌స్టైల్‌లో మార్పులు వచ్చాయి. దీంతో పండ్ల వినియోగం పెరిగింది. ఇక రకరకాల పేర్లతో టీస్టాల్స్ వెలుస్తున్నాయి. ఇక్కడ కొందరు తోపుడుబండ్లు, టీ అంగళ్లు, వాటర్ ప్లాంట్లు పెట్టుకుని ఉపాధి పొందుతూ బతుకుబండిని లాగిస్తున్నారు.

ప్రైమ్ లొకేషన్

కడప నగరంలో ఐటీఐసర్కిల్ ఏరియా, కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్, అన్నమయ్య సర్కిల్ నుంచి మున్సిపల్ హైస్కూలు, గ్రంథాలయం, స్టేడియం, శంకరాపురం, అప్సరసర్కిల్, కో ఆపరేటివ్‌కాలనీ, నెహ్రూపార్కు, రాజీవ్‌పార్కు, అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, సంధ్యసర్కిల్, ఎర్రముక్కపల్లె, పాత వన్‌టౌన్ సర్కిల్, మద్రాసురోడ్డు, క్రిష్ణాసర్కిల్ ఇంకా చాలా ప్రైమ్ లొకేషన్లు బిజినెస్ అడ్డాలు. ఇక్కడ షాపింగ్‌మాల్స్ మొదలుకుని ఫ్రూట్స్, టీఅంగళ్లు, పానీపూరి, టిఫిన్ సెంటర్లు భారీ ఎత్తున ఉన్నాయి.

ఒకప్పుడు ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చేవారు. కార్పొరేటర్లుగా ఎన్నికైతే తన ఐదేళ్ల పాలనలో నా డివిజనులో ఇంత అభివృద్ధి చేశాం, ఇన్ని మంచి పనులు చేశాం, జనానికి ఎంత సేవ చేశామో గుర్తించేందుకు పోటీ పడి పనులు చేసేవారు. అయితే ఇప్పుడు కొందరు కార్పొరేటర్లు దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలంటూ పదవిని అడ్డుపెట్టుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. ఐటిఐసర్కిల్ ఏరియాలో మొత్తం ఐదు డివిజన్లు వస్తాయి. అయితే ఇక్కడ ఓ ప్రజాప్రతినిధి నెలకు వాటర్‌ప్లాంటుకు రూ.20వేలు, రోడ్డుమీద పెట్టుకుని అమ్మేవాటికి, టీ అంగడి రూ.8 వేలు, చికెన్‌షాపుకు రూ.6వేలు వసూలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వ్యాపారస్తులు కార్పొరేషన్‌లో ట్రేడ్‌లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసుకోవచ్చు. ఏదైనా రూం రెంటుకు తీసుకుంటే అద్దె యజమానికి చెల్లించాల్సి ఉంది. అయితే ఇక్కడ కేవలం తమ ఏరియాలో వ్యాపారం చేసుకుంటున్నారన్న ఉద్దేశ్యంతో కప్పం కట్టించుకుంటున్నారు. ఐటిఐసర్కిల్ ప్రాంతంలో వసూళ్ల వ్యాపారం ఇటీవల కలకలం రేపి ఫిర్యాదు వరకు వెళ్లింది. సెవెన్‌రోడ్స్ ఏరియాలో ఐదు డివిజన్లు వస్తాయి. ఈ ఏరియా అంతా హాస్పిటల్స్, ల్యాబ్‌లు, తోపుడుబండ్లు, టిఫిన్ సెంటర్లు, అంగళ్లు ఇలా రకరకాల వ్యాపారాలు ఉంటాయి. అయితే ఇక్కడ కొందరు కార్పొరేటర్లు మరీ దిగజారిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుళాయి కనెక్షన్ తీసుకున్నా కూడా కార్పొరేషన్‌కు డబ్బు కట్టకపోయినా పర్లేదు కానీ ఇక్కడ కొందరికి కప్పం కట్టడమే హాట్ టాపిక్‌గా మారింది. దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న నేమ్ బోర్డులకు కూడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇక అన్నమయ్య సర్కిల్ నుంచి మున్సిపల్ స్కూలు శంకరాపురం వెళ్లే ఏరియాలో మూడు డివిజన్లు వస్తాయి. ఇక్కడ తోపుడుబండ్లు, టిఫిన్‌సెంటర్లు, టీ అంగళ్లు ఉన్నాయి. ఇక్కడ కూడా తోపుడుబండికి రూ.3వేలు, కొబ్బరిబోండాల అంగడికి రూ.4వేలు చొప్పున, టిఫెన్ బండ్లకు ఐదారువేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజీవ్‌పార్కు ఏరియా ప్రస్తుతం ప్రైమ్ లొకేషన్. ఇక్కడ పార్కు అభివృద్ధి చేయడం, ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో రకరకాల ఫుడ్ ఐటెమ్స్ ఉంటాయి. ఈ ఏరియాలో ఐదు డివిజన్లు ఉన్నాయి. అయితే ఇక్కడ ఇదే విధంగా డబ్బులు వసూలు చేస్తుండడం గమనార్హం. గత కమిషనరు సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు వ్యాపారులు బాక్స్‌కు రూ.2వేలు చొప్పున అప్పట్లో కార్పొరేషనుకు చెల్లించేవారు. అయితే ఇప్పుడు దానిపై కొందరు అధికార పార్టీ నేతల కన్నుపడినట్లు చెబుతారు. శవాల మీద పేలాలు ఏరుకున్నట్లుగా రోడ్లపై బండ్లు పెట్టుకునే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తుండడం చూసి ఛీ ఛీ అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



ఐటీఐ సర్కిల్‌లో ఉన్న తోపుడుబండ్లు

ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది

- అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతన్నలను ఆదుకోవాలి
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వెంటనే అందించాలి
- గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ సీఎం వైఎస్ జగన్



తోటలోని అరటి గెలను పరిశీలిస్తున్న వైఎస్ జగన్

పులివెందుల/లింగాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికొదిలేసిందని, వారి బాగోగులు చంద్రబాబుకు పట్టలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు వచ్చిన జగన్ సోమవారం లింగాల మండలంలో ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటితోటలను పరిశీలించారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల గ్రామాల్లో అరటి తోటలను పరిశీలించిన అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని, నష్టపరిహారం వచ్చేలా చేస్తామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం కనీసం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, గతేడాది, ఈ ఏడాది పంటలకు ప్రీమియం చెల్లించక రైతులకు బీమా వస్తుందో రాదో కూడా అంతుబట్టని పరిస్థితి తయారైందన్నారు. అకాల వర్షాలకు, ఈదురుగాలులకు ఉద్యానపంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, ఇన్‌పుట్ సబ్సిడీ పంటల బీమా ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని, ప్రతి పంటలకు ఇ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేసి పంటల బీమా వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఏ పంట కూడా గిట్టుబాటు ధర కల్పించే పరిస్థితిలో లేదన్నారు. మిర్చిని రూ.11,800లతో కొనుగోలు చేస్తామని చెప్పినా కేజీ కూడా కొనలేదన్నారు. పెసలు, మినుములు, కందులు ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. గతంలో చీనీ పంటకు టన్ను లక్ష వరకు పలికిందని, కానీ ప్రస్తుతం రూ.15వేలు, రూ.18వేలు, రూ.20వేలు ధర పలుకుతోందన్నారు. చివరకు రైతుల కోసం పులివెందుల ప్రాంతంలో నిర్మించిన కోల్డ్‌స్టోరేజ్ వినియోగించుకోవడంలో చేతులెత్తేసిందని పేర్కొన్నారు. పులివెందుల ప్రాంతంలో అరటికి పెట్టింది పేరని, ఈ రైతులకు మేలు కల్పించేందుకే రూ.25 కోట్లతో కోల్డ్‌స్టోరేజ్ నిర్మించి ఎన్నికల ముందే ప్రారంభించామన్నారు. కానీ ఈ ప్రభుత్వం టెండర్ పిలిచి యూజర్ ఏజెన్సీలకు అప్పగించడం లేదని తెలిపారు. నాలుగువేల ఎకరాల రైతులకు భరోసా ఇస్తున్నామని, ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సొమ్ము వచ్చేలా చూద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్‌రెడ్డి తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'యోగివేమన'కు రూ.7 కోట్లు విడుదల

- జీతాలు, పెన్షన్ల కోసం అదనపు కేటాయింపులు

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడప యోగివేమన యూనివర్శిటీకి రూ.7 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం బడ్జెట్‌ను మించి అదనపు కేటాయింపుగా మంజూరు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వైవీయూకు రూ.42 కోట్ల 4 లక్షల 66 వేలు కేటాయించారు. ఈ మొత్తాన్ని వినియోగించుకొనేందుకు గతంలోనే అనుమతించారు. ఇది కాకుండా అదనపు కేటాయింపుగా వర్శిటీ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ఈ అదనపు నిధులు ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలు, పెన్షన్లు డ్రా చేసుకొనేందుకు యూనివర్శిటీకి అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ చేశారు.

కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్న కలెక్టర్


కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరుకానున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్వర్ణాంధ్ర విజన్- 2047 తదితర అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

25, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

- డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు

7

భక్తిశ్రద్ధలతో గోవిందమాంబ ఆరాధనోత్సవాలు



7

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం

- న్యాయవాదుల శిక్షణలో జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

7

తమలపాకు సాగు.. ధర బాగు..



7

జగన్‌రెడ్డి మొసలికన్నీరు ప్రజలు నమ్మరు

- పంటనష్ట పరిహారానికి సర్కార్ సిద్ధం
- ఆదినారాయణరెడ్డి, మాధవిరెడ్డి, శ్రీనివాసరెడ్డి



పాత్రికేయులతో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి మొసలికన్నీరు ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక ద్వారకానగర్‌లోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏదేని జంతువులు చనిపోతే దాన్ని పీక్కుతినేందుకు రాబందులొచ్చినట్లుగా మాజీ సీఎం జగన్‌రెడ్డి కూడా అదే పంథా అనుసరిస్తూ ఎవరైనా చనిపోతే పరామర్శ పేరుతో బెంగుళూరు ప్యాలెస్ నుంచి బయటకు రావడం తప్ప ప్రజలకు మంచి చేద్దామనే ధ్యాసే ఆయనకు లేకుండా పోయిందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పులివెందుల, లింగాల ప్రాంతాల్లో అరటి పంట దెబ్బతిన్న సంగతి తెలిసిందేనని, కాగా హుటాహుటిన దెబ్బతిన్న పంటల తాలూకు విషయాన్ని జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెనువెంటనే సీఎం చంద్రబాబు స్పందించారన్నారు. ఏ మేరకు పంట నష్టపోయిందనే విషయాన్ని సమీక్షించి తద్వారా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బిటెక్ రవి కూడా స్వయంగా పంటలను పరిశీలించి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని చెప్పారన్నారు. అయినప్పటికీ జగన్‌రెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం నేరుగా బెంగుళూరు నుంచి పులివెందుల చేరుకుని, అకాల వర్షానికి కూలిన అరటి పంట రైతులను పరామర్శించేందుకు అత్యుత్సాహంతో హాజరై మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా వుందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోతే ఏనాడూ రైతుల వద్దకు రాలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు జగన్‌రెడ్డికి బై బై చెప్పారన్నారు.

కడపలో సాగిన అవినీతిపై నగర మేయర్ నోరు విప్పాలి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కడప నగర మేయర్, అతని కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ పనుల్లో సాగించిన అవినీతి అక్రమాలపై సంబంధిత విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారని, ఈ విషయంగా 15 రోజుల వ్యవధిలో నగర మేయర్ సంజాయిషీ ఇవ్వాల్సి వుందన్నారు. ఈ విషయంగా ఆయన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి నాయకులను ప్రజలు విశ్వసించే రోజులు కనుచూపు మేరలో లేవన్నారు. సమావేశంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి బాధితులు హాజరై తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా పరిష్కారం చూపాలన్నారు. తొలుత పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో ఓబులమ్మ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాజుపాలెం మండల కేంద్రానికి చెందిన బండి జ్యోతి ఫిర్యాదు చేస్తూ తన భర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందాడని, తనకు 5 ఏళ్ల లోపు నలుగురు చిన్నపిల్లలు ఉన్నారన్నారు. జీవనం కష్టంగా ఉన్నందున రేషన్‌కార్డు మంజూరు చేసి, వితంతు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సిద్దవటం మండలం మాచుపల్లికి చెందిన సుబ్బారెడ్డి.. ఆధార్ కార్డులో తన వయస్సు తక్కువగా నమోదు కావడంతో పెన్షన్ అందడం లేదని, వయసు నిర్ధారించి పింఛను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సరస్వతి, ఎస్డీసీ వెంకటపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



డీఆర్వో వద్ద తమ సమస్యలు తెలుపుకుంటున్న సుధాకర్

న్యాయం జరగలేదంటూ... కిరోసిన్‌తో కలెక్టరేట్‌లోకి వచ్చిన వ్యక్తి

తన భూమి ఆన్‌లైన్ విషయంలో రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేదంటూ... ఓ వ్యక్తి కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల వేదికకు కిరోసిన్ డబ్బాతో వచ్చాడు. కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తిని తనికీ చేసిన పోలీసులు కిరోసిన్ డబ్బాను స్వాధీనం చేసుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయం కలెక్టరేట్‌లో హల్‌చల్ అయింది. గతవారం ఓ బాధితుడు తన భార్యకు ఆపరేషన్ వికటించడంతో ఇందుకు కారణమైన ప్రభుత్వ డాక్టర్‌ను సస్పెండ్ చేయాలంటూ పెట్రోల్ డబ్బాతో వచ్చి భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ సంఘటన మరవక ముందే బి.మఠం మండలం, ముడమాల గ్రామానికి చెందిన గుడిమి సుధాకర్ తనకు న్యాయం జరగలేదంటూ కిరోసిన్‌తో రావడంతో కలెక్టరేట్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈయన రీసర్వేలో భాగంగా పెద్దల ఆస్తిని తన సోదరుడు కలుపుకొని పాసుబుక్కు తయారు చేయించుకున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ ఇక్కడికి వచ్చానని తెలిపారు. డీఆర్వో స్పందిస్తూ.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని మండల అధికారిని ఆదేశించారు. కాగా ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు చేరడంతో సభాభవన్‌లో జరిగే ప్రజా సమస్యల వేదిక వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేసి, తనికీలు చేసిన తరువాతే పంపాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

- ఎవరూ అధైర్యపడొద్దు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

లింగాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అరటి పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పులివెందుల నియోజకవర్గంలో అరటితోటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. ఈ తోటలను పరిశీలించేందుకు ఇన్‌చార్జి మంత్రి సవిత లింగాల మండలంలో పర్యటించారు. పార్నపల్లె, తాతిరెడ్డిపల్లె గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని, వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చూస్తోందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద హెక్టార్‌కు రూ.25 వేలు ఇచ్చిందని, కానీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.35 వేలకు పెంచినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా రైతుల పంట నష్ట వివరాలను ప్రభుత్వానికి అందేలా చూస్తామన్నారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లెలో రైతులను కూడా మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



అరటితోటలను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

పార్టీలకతీతంగా రైతులను ఆదుకుంటాం

- ఫోన్‌లో మంత్రి అచ్చెన్నాయుడు

పార్టీలకతీతంగా రైతులను ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్‌లో రైతులకు భరోసా ఇచ్చారు. లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో పంట దెబ్బతిన్న రైతులను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితో ఫోన్‌లో మాట్లాడించారు. రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పెనుగాలులు, వడగండ్ల వర్షానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడి సర్వం కోల్పోయారన్నారు. నష్టం తీర్చలేనిదని, ప్రభుత్వం దృష్టికి రైతు సమస్యలు తీసుకెళ్లి ఇన్‌పుట్ సబ్సిడీ మరింత పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యల్లనూరు మండలం నేర్జాంపల్లెలో ఆదివారం ఆత్మహత్యలకు పాల్పడిన లక్ష్మీనారాయణ, వెంగప్ప కుటుంబాలను పరామర్శించారు. మూడు రోజులుగా కరెంటు లేదని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని తెలపగా, వెంటనే విద్యుత్ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఆర్డీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య కాలిబాట అటకెక్కినట్లేనా?

- రెండు దశాబ్దాలుగా పెరుగుతున్న డిమాండ్
- గతంలో సుముఖత వ్యక్తం చేసిన టీటీడీ
- అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు
- ఆ తర్వాత నోరు మెదపని పాలకులు



మలుపులు లేని శేషాచలం అన్నమయ్య కాలిబాట

రాజంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బాలపల్లె అటవీ ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు అంశం అటకెక్కినట్లుగా కనిపిస్తోంది. కడప, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర వాసులకు ఎంతో ఉపకరించే ఈ మార్గం ఏర్పాటు విషయం గత ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదు. పూర్వ కాలంలో తిరుమలకు వెళ్లే భక్తులు అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాక నుంచి బాలపల్లె అటవీ ప్రాంతంలోని మామండూరు, రైల్వేకోడూరు మీదుగా కాలినడకన వెళ్లేవారు. అప్పటి కాలిబాట నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. అటువంటి మార్గంలో రోడ్డు వేయాలని భక్తులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజంపేట ప్రాంతానికి చెందిన వేలాదిమంది కాలినడకన తిరుపతికి వెళ్లి మరీ విజ్ఞప్తి చేశారు. తిరుపతికి వెళ్లి తిరుమలకు చేరుకోవడం అందరూ చేస్తున్న పని. దీంతో తిరుపతిలో రద్దీ పెరిగింది. అదే అన్నమయ్య కాలిబాటను పునరుద్ధరిస్తే సుమారు 20 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఘాట్‌రోడ్డు అవసరమూ ఉండదు. ఒకానొకదశలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఘాట్‌రోడ్డు నిర్మాణంపై సుముఖత వ్యక్తం చేసింది. కాలిబాట పునరుద్ధరణకు కేంద్రం, అటవీశాఖ అనుమతిస్తే పనులు ప్రారంభిస్తామని టీటీడీ గత ఛైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు కూడా. అయితే ఆ ప్రతిపాదన కేవలం ప్రకటనల వరకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్నమయ్య కాలిబాట పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరుపతిలో రద్దీ తగ్గుతుంది



అన్నమయ్య, కడప జిల్లాల అభివృద్ధికి ఎంతో ఉపకరించే అన్నమయ్య కాలిబాటను వెంటనే ఏర్పాటు చేయాలి. శతాబ్దాల కిందటే అన్నమయ్య తాళ్లపాక నుంచి ఏడు కొండల ద్వారా కాలినడకన శ్రీవారి చెంతకు వెళ్లేవారు. ఈ మార్గాన్ని ఏర్పాటు చేస్తే ఎటువంటి రద్దీ ఉండదు. తిరుపతిలో భక్తుల రద్దీ తగ్గి అక్కడ ప్రశాంతత ఏర్పడుతోంది. దూరం తగ్గుతుంది. తిరుపతితో పాటు అన్నమయ్య జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది.

- పీసీ యోగీశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్,



అన్నమయ్య కాలిబాట వెళ్లే శేషాచలం అడవులు

కాలిబాటను ఏర్పాటు చేయాలి



అన్నమయ్య జిల్లా పర్యాటక ప్రాంతంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలంటే అన్నమయ్య కాలిబాట ఏర్పాటు చేయాలి.. దీంతో అన్నమయ్య భక్తికి సార్థకత చేకూరుతుంది. అన్నమయ్య జిల్లా కూడా తిరుమల తిరుపతిలా పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెంది ప్రపంచంలోనే గుర్తింపు పొందుతుంది. ప్రజా ప్రతినిధులు కాలిబాటలో రోడ్డు ఏర్పాటుకు నడుం బిగించాలి.

- మధుసూదన్‌రెడ్డి, తాళ్లపాక

నీటి సరఫరా పథకాల్లో అవినీతి

- రూ.3.10 లక్షలు దుర్వినియోగం .. ● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై అభియోగాలు నమోదు

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వీరబల్లి మండలం గ్రామీణ తాగునీటి సర ఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ ఎస్.ఇర్ఫాన్ అహ్మద్‌పై ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు సం బంధించిన అభియోగాలు నమోదు చేసింది. ఈ మేరకు ఆయన నుంచి వివరణ కోరుతూ సోమవారం నోటీసులు జారీ చేసింది. కర్నూలు జిల్లా డోన్ సబ్ డివిజన్ కృష్ణగిరి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈగా పనిచేసే సమయంలో మూడు తాగునీటి సరఫరా పథకాల నిర్మాణాల విషయంలో ఆయన అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రభుత్వం పేర్కొంది. కృష్ణగిరి మండలంలో కటారి కొండకు రూ.19 లక్షలు, కృష్ణగిరికి రూ.17 లక్షలు, తాపలకొత్తూరుకు రూ.17 లక్షలతో మూడు రక్షిత నీటి సరఫరా పథకాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు ఇర్ఫాన్ అహ్మద్ సర్టిఫికెట్లు జారీ చేశారు. దీంతో వంద శాతం చెల్లింపులు చేసేశారు. ఫిర్యాదులు రావడంతో ఆ శాఖ విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ విభాగం 2023 సెప్టెంబరు 8న తనిఖీ చేసింది. మూడు పథకాలకు సంబంధించి రూ.3.10 లక్షల విలువైన పనులు ఇప్పటికీ పెండింగులో ఉన్నట్లు గుర్తించారు. ఫలితంగా తాగు నీటి సరఫరా జరిగే అవకాశం లేకుండా అసంపూర్తిగా మిగిలాయి. మొత్తం వ్యవహారాన్ని ఆ శాఖ ఇంజనీరు ఇన్ ఛీఫ్ ఈ నెల 22న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. వెంటనే స్పందించి పూర్వాపరాలను పరిశీలించి ఇర్ఫాన్ అహ్మద్ తప్పిదాలను నిర్ధారిస్తూ అభియోగాలపై నోటీసులు జారీ చేసింది. 10 రోజుల్లోగా ఆయన సంజాయిషీ సమర్పించుకునేందుకు గడువిచ్చింది. ఈయనతో పాటు అప్పట్లో డీఈగా పనిచేస్తూ ఈ పనులను పర్యవేక్షించి ప్రస్తుతం ప్రకాశం జిల్లా పొదిలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.సురేష్‌బాబుకు కూడా ఇదే విధమైన నోటీసులు జారీ అయ్యాయి. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఈ మేరకు అన్ని రకాల సాక్ష్యాధారాలతో ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు డీఎల్‌సీఓ తిరుపతికి బదిలీ

కలికిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలోడిప్యూటీ రిజిస్ట్రారు హోదాలో వుంటూ ప్రస్తుతం ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న జె.సురేష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయనను తిరుపతి డీఎల్‌సీవోగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దంపతుల కేటగిరీ కింద ఆరోగ్య కారణాల రీత్యా తిరుపతిలో ఖాళీగా వున్న డీఎల్‌సీవో పోస్టుకు ఆయన్ను బదిలీ చేశారు. ప్రస్తుతం బదిలీలపై వున్న నిషేధాన్ని మినహాయిస్తూ ఆయన చేసుకున్న దరఖాస్తు మేరకు బదిలీ చేస్తున్నట్లు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

డెప్యుటేషన్‌పై విజయవాడకు కడప మత్స్య శాఖ డీడీ

కడప మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టరుగా పనిచేస్తున్న వి.పెద్దిబాబును డెప్యుటేషన్‌పై విజయవాడకు బదిలీ చేశారు. విజయవాడలో వున్న ఏపీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ జనరల్ మేనేజరుగా నియమించారు. ఏడాది కాలం పాటు డెప్యుటేషన్‌లో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మత్స్య శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేవళంవీధిలో సోమవారం గుర్తు తెలియని యువకుడు ఇంట్లోకి చొరబడి వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లాడు. అరవడానికి వీలు లేకుండా, నోరు నొక్కి ఒత్తిడి చేశాడని, ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించి ఉన్నట్లు బాధితురాలు రాజమ్మ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు 35 గ్రాముల చైన్ రెండు లక్షల రూపాయలు విలువ చేస్తుందని ఆమె వివరించింది. ఇ వన్‌టౌన్ సీఐ ఎరిసావలి కేసు దర్యాప్తు చేస్తు న్నారు.

ఇంట్లో దండించారని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి24(ఆంధ్రజ్యోతి)ఇంట్లో దండించారని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని రాజానగర్‌కు చెందిన కృష్ణమూర్తి కుమారుడు బన్నీ (19) ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదివి ఇంట్లో ఖాళీగా ఉన్నాడు. జులాయిగా తిరుగుతుండడంతో సోమవారం తల్లి పార్వతి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకుతో గొడవపడి తండ్రి..

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కొడుకుతో గొడవపడి ఓ తండ్రి ఆత్మహత్యా యత్నం చేశాడు. మదనపల్లె పట్టణం, విజయనగర్ కాలనీకి చెందిన కృష్ణప్ప(60) ఆవులకు మేత తీసుకురావాలని తన కొడుకుకు సూచించాడు. అతను వెళ్లకపోవడంతో గొడవపడ్డాడు. దీంతో ఆవేశానికి లోనై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె టూ టౌన్ పోలీసులు కేసును విచారణ చేపట్టినట్లు తెలిపారు.

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు ఆదివారం రాత్రి మండలంలోని గంగన్నగారిపల్లెకు చెందిన మధు, తన భార్య లక్ష్మి వాదులాడుకుంటుండగా పక్కనే మద్యం తాగుతున్న ముగ్గురు యువకులు అతనిపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.


చిప్పిలిలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల దాడిలో ముగ్గురు యువకులు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామంలో కొందరు యువకులు సోమవారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో లడ్డు అనే యువకుడు జంగాలపల్లెకు చెందిన ఆదికేశవ(40), వేంపల్లెకు చెందిన చరణ్(30), అవకిశెట్టిపల్లెకు చెందిన సుమంత్(30)ను రాళ్లతో కొట్టి గాయపర్చాడు. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదికేశవ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

రామాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాత రామాపురానికి చెందిన వెన్నుపూస నరేంద్ర తన కమారుడు యస్విక్‌ప్రసాద్‌తో కలసి సోమవారం బైక్‌లో రాయచోటి నుంచి రామాపురానికి వస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో కడప నుంచి వస్తున్న కారు ముందు వస్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెక్కల కొండకు నిప్పు



మంటల్లో కాలిపోతున్న రెక్కలకొండ

పెద్దమండ్యం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) మండలంలో రెక్కల కొండ అడవికి సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వందల ఎకరాలు అటవీ ప్రాంతం కాలి బూడిద కాగా వన్య ప్రాణులు అగ్నికి ఆహుతైనట్లు పలువురు వాపోతున్నారు. అడవిలో నిప్పు పశువుల కాపరుల పనేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా అటవీ అధికారులు చర్యలు తీసుకొని నిప్పుబారి నుంచి అడవిని కాపాడాలని ప్రజలు కోరారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ



రాయచోటి: అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



కడప: వికలాంగుడి సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యో తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్ర జా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుం చి వచ్చిన ఫిర్యా దుదారులతో ముఖాముఖి మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేసి నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు తమకు సమీపం లోని పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

కడప క్రైం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యమిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసు స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదు లను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్ బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను తక్షణమే పరిష్కరించాలి: సబ్ కలెక్టర్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి

రాజంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీలపై విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పరిష్కారవేదిక కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఏవైనా చిన్న సమస్యలు పరిష్కరించకుండా కార్యాలయాల చుట్టూ బాధితులను తిప్పుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.12 లక్షలు మోసం చేసిన మూలగంగమ్మ డ్వాక్రా గ్రూపు లీడర్ షేక్. మౌలాబీపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరానికి చెందిన మూలగంగమ్మ తల్లి డ్వాక్రా గ్రూపు మాజీ లీడర్ షేక్. మౌలాబీ తప్పుడు సంతకాలతో కడప డీసీసీ బ్యాంకులో రూ.12 లక్షలు డ్రా చేసిందన్నారు. డబ్బులు కట్టాలని బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులను అడగడంతో విషయం బయటపడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేసన్ జిల్లా కమిటీ సభ్యులు రమణ, సుజాత తదితర కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు

నిమ్మనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కేబుల్ వైర్ల దొంగలు వీరవిహారం చేస్తున్నారు. దాదాపు వారం రోజులుగా రాత్రి వేళల్లో నిమ్మనపల్లి, వెంగంవారిపల్లి, అగ్రహారం పంచాయతీలోని వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న దాదాపు 1000 మీటర్ల కేబుల్ వైర్లను చోరీకి గురికాగా, ఆదివారం రాత్రి మాత్రమే 25 బోర్లకు చెందిన కేబుల్ వైర్లను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది.

దీని విలువ దాదాపు రూ.లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. తిరిగి కేబుల్ ఏర్పాటు చేసుకునేందుకు 10 రోజులు పడుతుందని, ఈ లోగా పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీనిపై సోమవారం వెంగళకురవపల్లికి చెందిన రైతు హరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒక్క రోజు రాత్రి మాత్రమే మూడు గ్రామాల్లో కేబుల్ వైర్లు చోరీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజుల క్రితం పోలీసులు ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండుకు తరలించారు. అయినా దొంగలు కేబుల్ తీగలనే టార్గెట్‌గా పెట్టుకుని పోలీసులకే సవాల్ విసురుతున్నారు.

తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం

- వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి



తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన అచార్యులు ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం యోగి వేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు రెండో విడత తైక్వాండో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణను పెంపొందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు నాగూర్‌బాబు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి డీవీ రంగరాజు

రాయచోటిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి డీవీ రంగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. ముఖ్యంగా కర్మాగారాలు, ఫ్యాక్టరీలు, దుకాణాల సంస్థల్లో పనిచేసే కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలని, పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ఫ్లూయిడ్స్ అత్యవసరమైన మందులను అదుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని, కార్మికులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని కర్మాగారాలు, ఫ్యాక్టరీ యజమానులు, దుకాణదారులకు ఆదేశించారు.

పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్!

- వేంపల్లిలోని పరీక్ష కేంద్రాల్లో డీఈఓ షంషుద్దీన్ తనిఖీ

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష సరళిపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక బాలుర, బాలికల హైస్కూళ్లలోని నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తుండగా మాస్ కాపీయింగ్ జరుగుతోందంటూ ఫిర్యాదులు అందడంతో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓ పరీక్ష కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని ఫిర్యాదు అందడంతో డీఈవో సంబంధిత గదిలోని విద్యార్థులను తనిఖీ చేసినట్లు తెలిసింది. ఫిర్యాదులపై ఇన్విజిలేటర్లను, ఎంఈఓలను అప్రమత్తం చేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా తప్పు జరిగితే కఠిన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చ రించారు. అయితే డీఈఓ తనిఖీలపై పలువురు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనిఖీలు చేశారని, దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురై, జవాబులు మరచిపోయి, పరీక్ష సరిగా రాయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంటే పట్టుకోవాలి తప్ప భయంగొలిపే విధంగా అక్కడే ఉండి తనిఖీలు చేయడం ఏమిటని వాపోతున్నారు. ఫిర్యాదులు అందడం వల్లే తనిఖీలు చేశామని, వేంపల్లెతో పాటు బి.మఠం, కందిమల్లాయపల్లె, చక్రాయపేట మండలాల్లో ఫిర్యాదులు అందాయని, అన్నిటిపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు.

రైల్వే కోడూరులో..

రైల్వేకోడూరు రూరల్: పట్టణంలోని పది పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరోపించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థ విద్యార్థులు ఐడెంటిటీ కోసం చేతులకు ఎరుపు రంగు బ్యాడ్జీలు ధరించి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వీరిపట్ల ఇన్విజిలేటర్లు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న విద్యాసంస్థలు, ఇన్విజిలేటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో భాష్యం విద్యా సంస్థల్లో ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్‌కు వివిధ విభాగాలకు చెందిన 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 19 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిని వైవీయు అధికారులు అభినందించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సభ్యుడు డాక్టర్ గణేష్ నాయక్, భాష్యం విద్యాసంస్థల రాయలసీమ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాగ్నిజెంట్ కంపెనీలో

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



కాగ్నిజెంట్ సంస్థకు ఎంపికైన విద్యార్థులు

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన కాగ్నిజెంట్ ఐటీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. 25 మందికి ఉద్యోగాలు రాగా ఇందులో రూ.4.50లక్షల వేతనం కొందరు, రూ.5 నుంచి రూ.7లక్షల వరకు వేతనానికి మరి కొంతమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆహ్వానం మేరకు కాగ్ని జెంట్ ఐటీ సంస్థ ఈ క్యాంపస్ సెలక్షన్లను నిర్వహించడం మంచి పరిణామమని డైరెక్టర్ గుప్త అన్నారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినం దించారు. ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాష్, ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు వినోద్, సుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామిరెడ్డికి డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా సెండ్ బాక్స్ కల్లూరి రఘురామిరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఊబకాయం, మధుమేహం ఆహారంతోనే తగ్గించే విధంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం లభించింది. నెంబర్ గ్లోబల్ అక్రిడేషన్ కౌన్సిల్ జర్మనీ జార్జ్ ఫ్రెండ్ పీటర్, నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కావేర్వెల్, డాక్టర్ కిమ్, డాక్టర్ ఎ.గోపి కన్నన్‌చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

హుండీ ఆదాయం రూ.8 లక్షలు

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.8,15,239 వచ్చినట్లు ఈవో క్రిష్ణానాయక్ తెలిపారు. గంగమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని భక్తుల సమక్షంలో సోమవారం లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందని, ఈ ఆదాయాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మారుతీప్రసాద్, మహదేవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పుల్లయ్య, నాగమల్లారెడ్డి, లక్ష్మిదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బట్టా కిశోర్‌బాబు (30) మృతి చెందాడు. తీవ్రగాయాలైన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తీసుకెళ్లగా సోమవారం సాయంత్రం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు మండలంలోని గూడెంచెరువు రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనిచేసుకుని జీవించేవాడన్నారు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

బ్యాడ్మింటన్ చాంపియన్స్‌గా నాగరాజు-నితిన్ జోడీ

కడప స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర ఫక్కీరుపల్లె పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలలో నాగరాజు- నితిన్ జోడీ విజేతగా నిలిచింది. సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు న్యాయమూర్తి రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. కాగా టోర్నమెంట్ రన్నరప్‌గా నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి జోడీ నిలిచింది. ఇదిలావుండగా అంతర్జాతీయ అంపైర్‌గా బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న జిలానీబాషాను ఈ సందర్భంగా సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు

కాశినాయన మార్చి23(ఆంధ్రజ్యోతి) అదనపు కట్నం కోసం కుటుంబ సభ్యులతో కలిసి భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపించి మరో యువతిని గుడిలో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మిద్దెల ఎస్సీకాలనీకి చెందిన ఎర్రబల్లె ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కూతురు సంధ్యను 2023 మే నెలలో కమలాపురం మండలంలోని జి.అప్పాయపల్లెకు చెందిన కుందూరు ఓబులేసు కుమారుడు అనంతరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీఆర్వోగా పని చేస్తున్న అనంతరాజు పెండి చేసుకున్న కొన్నినెలలకే కుటుంబ సభ్యులతో కలిసి భార్య సంధ్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధించడం మొదలు పెట్టాడు. వారి బాధలు భరించలేక సంధ్య పుట్టింటికి చేరింది. ఇదే అదనుగా భావించిన అనంతరాజు అదే సంవత్సరం నవంబరు నెలలో బీర అంజలి అనే వేరొక యువతిని పుష్పగిరి ఆలయంలో గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య సంధ్య భర్త అనంతరాజుతో పాటు బీర అంజలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బీరం అంజలి మహిళా పోలీసుగా పనిచేస్తున్నట్లు సమాచారం.



తమలపాకు సాగు.. ధర బాగు..



రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట



దుప్వారు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నోరు పండించే తమలపాకు ధరలు మండుతున్నాయి. సాగు చేసిన రైతులు ఆనందపడుతున్నారు. గత కొంత కాలంగా మార్కెట్ ధరలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఈ ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. దువ్వూరు మండలంలో విరివిగా తమలపాకు పంట సాగు చేశారు. రాంసాయినగర్, క్రిష్ణంపల్లె, కానగూడూరు, దువ్వూరు ప్రాంతాల్లో సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఎకరాలో పంట సాగు చేయాలంటే రూ.2 లక్షల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ పైరుకు నిత్యం కూలీల అవసరం ఉంటుంది. పరిస్థితులు సహకరించితే సరి.. లేదంటే వైరస్ తెగుళ్లు ఆశిస్తాయి. ఇక ప్రకృతి వైపరీత్యాలు అప్పుడప్పుడు దాడి చేసి తోటలను ధ్వంసం చేయడం లాంటి సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితులు తలెత్తినప్పుడు రైతులు నష్టాలను మూట గట్టుకోవడం పరిపాటిగా మారుతుంది. ఇటువంటి విపత్కర పరిస్థితులను దాటుకుంటూ రైతులు ముందుకెళుతున్నా ఆశించిన ధరలు లేకపోతే రైతులు నష్టాలపాలవుతారు. రెండేళ్లుగా ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ధర
లు ప
ర్వాలేదనిపిం
చినా ఆటుపోట్లు తప్పడం లేదు. దువ్వూరు ప్రాంతం నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాదు, కర్నూలు ప్రాంతాలకు తమలపాకు కట్టలను బుట్టల్లో తరలిస్తున్నారు. బుట్టలో 22 నుంచి 25 కట్టలను ఉంచి ప్యాకేజీ చేసి తరలిస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో బుట్ట వెయ్యి రూపాయల నుంచి రూ1400 ధర ఉందని రాంసాయినగర్‌కు చెందిన చలపతి అనే రైతు తెలిపారు.

రైతులు ఇప్పుడే ఊపిరిపీల్చుకుంటున్నారు

- రైతులను నష్టపరిచింది వైసీపీ.. అండగా ఉన్నది టీడీపీ
- జగన్‌ది పరామర్శ యాత్ర కాదు.. జైత్రయాత్ర
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వడగండ్ల వాన, ఈదురుగాలులకు లింగాల మండలంలో దాదాపు 3వేల ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని, ఆ వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఏ రైతుకు ఎంత నష్టం జరిగిందనే విషయం స్పష్టంగా తేల్చి నష్టపరిహారం అందించే చర్యలు త్వరతగతిన చేపడుతుందన్నారు. ప్రభుత్వం ఇంతలా రైతులను ఆదుకోవాలని చర్యలు చేపడితే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లింగాలలో పర్యటించి నాలుగేళ్లు కళ్లుమూసుకోండి.. మన ప్రభుత్వం వస్తుందని రైతులకు చెబుతున్నారన్నారు. అప్పుడు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెబుతున్నారని, నష్టం ఇప్పుడు జరిగితే నాలుగేళ్ల తర్వాత ఆదుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు బాధల్లో ఉంటే వారికి ధైర్యం, ఓదార్పు ఇవ్వాల్సింది పోయి పర్యటన అంతా జైత్రయాత్ర మాదిరి ఉందన్నారు. 2014-19 కాలంలో రైతులందరికీ అరటి మొక్కలు ఉచితంగా ఇచ్చామని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం ఎస్సీ, ఎస్టీలకే ఉచితంగా ఇచ్చారన్నారు. పులివెందులలో రూ.25కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటుచేసిన మాట వాస్తవమే అయినా రూ.10కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకుండా ప్రారంభించారని, కనీసం బోరు లేదు, జనరేటరూ లేదన్నారు. ఆ పెండింగ్ బిల్లులను ఈ ప్రభుత్వం చెల్లించి మెయింటెనెన్స్ చేసేందుకు ఏజెన్సీలను కూడా పిలవడం జరుగుతుందన్నారు. ఈనెల 28న కలెక్టర్ వద్ద ప్రీబిడ్ జరుగుతుందన్నారు. త్వరలో కోల్డ్‌స్టోరేజ్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. విషయాలు తెలుసుకొని మాట్లాడాలని, కేవలం విమర్శలు చేసి వెళ్లిపోతే సరిపోదన్నారు. రైతులు, ప్రజలంతా జరిగినవన్నీ గమనిస్తూనే ఉన్నారన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

- బైకు స్వాధీనం

కడప క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం కాలసముద్రానికి చెందిన షేక్ మౌలాలి పార్కింగ్ చేసిన బుల్లెట్ వాహనాలను చోరీ చేశాడని, ఈ మేరకు మౌలాలిని అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మరికొందరు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు నగర శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై, గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నకాశ్, సాయిపేట, ఉక్కాయపల్లె, మార్కెట్‌యార్డు, పాతకడప, మార్కెట్‌యార్డు వద్ద ఉన్న శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

వేసవి సమస్యలను అధిగమిద్దాం : డీఆర్వో

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీరు, అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల కారణంగా వడదెబ్బ సమస్యలను అధిగమించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో తాగునీటి కొరత, వేసవిలో వడగాల్పులు, వడదెబ్బ ముందస్తు జాగ్రత్తలపై జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్‌తో కలసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, దీనిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మండలాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఏఎన్ఎంలతో కలసి వడగాల్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో షెడ్లు, మంచినీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. అటవీ పరిరక్షణ ప్రాంతాల్లో పశు, పక్ష్యాదులకు తాగునీటి ఇబ్బందులు రాకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రథమ చికిత్స ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

25, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

- పటిష్టంగా నిర్వహించాలి : డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 27వ తేదీల్లో జరుగు ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్ట బందోబస్తు మధ్య, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే నాలుగు విధాల నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్షల నిర్వహణపై డీఆర్వో ఏపీపీఎస్సీ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, మానిటర్ షేక్ ఖాసీంవల్లితో కలసి అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 25, 27వ తేదీల్లో ఉదయం 9-30 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి పరీక్షలను సజావుగా జరపాలన్నారు. జిల్లాలో చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 3, చాపాడు మండలంలో-1, ప్రొద్దుటూరు-1 పరీక్షా కేంద్రాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు, పరీక్షల నిర్వహణకు సంబందించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీ

- ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడి మృతి
- మహిళకు తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో కలమల్ల గ్రామ శివార్లలో సోమవారం సాయంత్రం ఈకో వ్యాన్ ద్విచక్రవానాన్ని ఢీకొన్న సంఘటనలో కలమల్లకు చెందిన ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు రాజారెడ్డి(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వివరాల్లోకెళితే.. ఆర్టీపీపీ 600ప్లాంట్ యాష్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న రాజారెడ్డి తన భార్య సూజాతతో కలిసి ఎలక్ట్రిక్ స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళుతున్నాడు. వెనుకవైపు నుంచి అతి వేగంగా వచ్చిన మారుతిసుజుకి ఈకో వ్యాన్ ఢీకొట్టి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో స్కూటీలో వెళుతున్న రాజారెడ్డి, ఆయన భార్య కిందపడ్డారు. రాజారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కలమల్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ సుజాతను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించారు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గోవిందమాంబ ఆరాధనోత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేందస్వామి మఠంలో భక్తిశ్రద్ధలతో సోమవారం మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మపత్ని గోవిందమాంబ పరమేశ్వరి అమ్మవారి జీవసమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం సోమవారం క్రోధినామ సంవత్సర ఫాల్గుణ బహుళ దశమి రోజు కావడంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మధ్యాహ్నం ద్వార పూజ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి విశ్వబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి, విశ్వబ్రాహ్మణ భక్తుడు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పట్టుచీర, సారెను పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులకు అందించారు. రాత్రికి అమ్మవారిని మాడవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.



అమ్మవారికి సారె సమర్పించిన విశ్వ బ్రాహ్మణ కమిటీ భక్తులు

చల్లంగా చూడమ్మా.. గంగమ్మతల్లి

- వైభవంగా పాలగిరి గంగమ్మ జాతర
- తరలివచ్చిన భక్తులు



వీరపునాయునిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరిలో గంగమ్మజాతర వైభవంగా నిర్వహిం చారు. భారీఎత్తున భక్తులు తండోపతండోలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జంతుబలులు ఇచ్చారు. డప్పువాయిద్యాల మధ్య బాణసం చా పేల్చుతూ బోనాలు సమర్పించారు. బంధువులను స్నేహితులను ఆహ్వానించి విందుభోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి సిరిమాను బండిని ఎద్దులతో తిప్పారు. ఈ సిరిమాను ఉత్సవాన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. జాతర సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఐటీడీపీ సూర్యనారాయణరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కుంటకట్ట సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి వద్ద చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, టీడీపీ కార్యకర్తలలు పవన్‌కృష్ణ, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం

- న్యాయవాదుల శిక్షణలో జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీదేవి



కడప రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇందుకు న్యాయవాదుల తోడ్పాటు చాలా అవసరమని, కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి కూడా వీలుపడదన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ పీజీ సురేష్, జి.జ్యోతి తదితరులు మధ్యవర్తిత్వం, ప్రాథమిక నియమాలు, అభ్యాస సూత్రాలు, వయోజన అభ్యాసం, పౌర విధాన నియమావళి 1908 తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఓ మహిళ పూజ పేరుతో 15 తులాల బంగారం చోరీ చేసింది. సినిమా ఫక్కీలో మూట ముట్టుకోకూడదని బంగారం అపహరించింది. బాధితురాలి వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీలో కారపాకుల సుజాత, చంద్రశేఖర్ దంపతులు జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు చంద్రలావణ్యకు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో ఇందుకు పూజలు చేస్తే తగ్గుతుందని స్థానిక మహిళ ఓ అపరిచితురాలి గురించి చెప్పింది. దీంతో సోమవారం మధ్యాహ్నం ఆ అపరిచిత మహిళను ఇంటికి పిలుచుకుని ఒంటి గంట సమయంలో పూజ చేయించారు. పూజలో భాగంగా ఇంటిలో ఉన్న బంగారు లేదా వెండి వస్తువులు రెండు బాక్సుల్లో పెట్టాలని సూచించడంతో తమ ఇంటిలో ఉపయోగించని బాక్సులు లేవని చెప్పారు. పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న రెండు బాక్సులను సంచిలో నుంచి తీసి అందులో ఆ బంగారం, వెండి వస్తువులు పెట్టాలని తెలిపింది. ఈ మేరకు ఒక బాక్సులో 15 తులాల బంగారం, ఇంకో బాక్సులో బియ్యం తదితర పూజా సామగ్రి పెట్టిందని, పూజ ముగిసిన తర్వాత ఒక డబ్బా తమకు ఇచ్చి సాయంత్రం వరకు తెరిచి చూడకూడదని సూచించిందన్నారు. అనంతరం ఆ మహిళను చంద్రశేఖర్ తన స్కూటీలో తీసుకెళ్లి తాడిపత్రి రోడ్డు బస్టాపు వద్ద దింపాడు. ఇంటికి వచ్చిన బాక్సు తెరిచి చూస్తే అందులో బంగారం లేదని, బంగారం బాక్సును అపరిచిత మహిళ తీసుకెళ్లిందని గ్రహించారు. దీంతో తాము మోసపోయామని తెలుసుకుని బోరున విలపిస్తూ పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. అపరిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. జమ్మలడుగు ఆదివారం రాత్రి బాలిక(10)పై 58 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



యోగా ద్వారా మానసిక ప్రశాంతత

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా మానసిక ప్రశాంతత తద్వారా ఆరోగ్యపరిరక్షణ సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్, డీపీఎంయూ నాగశశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందికి యోగాపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయం పుణ్యకార్యం

కడప కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సాయం చేయడం ఎంతో పుణ్యకార్యమని, తెలుగుదేశం పార్టీ ఎన్.ఆర్.ఐ. విభాగం కువైట్ ఉపాధ్యక్షుడు రహమతుల్లా అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా సోమవారం ఉక్కాయపల్లెలో ఉన్న టీడీపీ ఎన్ఆర్ఐ విభాగ కార్యాలయంలో నగరంలోని పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాసాపేట శివ, టీడీపీ సీనియర్ నాయకులు నరసింహ తదితరులున్నారు.

అతిసార పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



పీహెచ్‌సీలో అతిసారతో చికిత్స పొందుతున్న రోగులు

చెన్నూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో అతిసార కేసులు పెరుగు తున్నాయని, సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. చెన్నూరు సీహెచ్‌సీలో అతిసార కేసులు వస్తున్న దృష్ట్యా సోమవారం పలువురికి వైద్యసేవలు అందించారు. అలాగే అతిసారతో చికిత్స పొందేవారికి తగిన సూచనలు సలహాలు అందించారు.

చవ్వా విజయశేఖర్‌రెడ్డికి నివాళులు



చవ్వా విజయశేఖర్‌రెడ్డికి నివాళులర్పించిన శ్రీనివాసరెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల వ్యాస్తవ్యులు వైఎస్ మనోహర్‌రెడ్డి బావమరిది ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి మరణించిన వార్త తెలుసుకుని సోమవారం ఉదయం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పులివెందులకు చేరుకుని సీవీ సుబ్బారెడ్డి నివాసం వద్ద విజయశేఖర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు దుష్యంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, మాధవరెడ్డి, జాఫరుల్లా, సుదర్శన్‌రెడ్డి, లోమడ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో పీ4 ప్రోగ్రాం

కడప(వినాయకనగర్), మార్చి24(ఆంధ్రజ్యోతి): నగరంలో 15వ డివిజన్‌లో సరోజీనగర్‌కాలనీలో పీ4 కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా 15వ డివిజన్ ఇన్‌చార్జి కొండా సుబ్బయ్య హాజరై పీ4 ప్రోగ్రాం గురించి ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా కొండా సుబ్బయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ మే నెలలో పెన్షన్లు విడుదలయ్యాయన్నారు.

ట్రేడ్‌మార్క్స్, పేటెంట్లపై అవగాహన కలిగిఉండాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ మార్క్స్ పేటెంట్ కాపీరైట్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాష పేర్కొన్నారు.సోమవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మేధా సంపత్ హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇండస్ట్రియల్ సంబంధించి అవగాహన కలిగి ఉంటే విద్య పూర్తైన తర్వాత స్వతహాగా ఇండస్ట్రియల్ ఏర్పాటుచేసుకునే వీలుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకం అందిస్తుందని చెప్పారు. విద్యార్థులు అవగాహన పెంచుకొని స్వతహాగా పరిశ్రమలలు స్థాపించే యోగ్యతను సాధించాల న్నారు. ఐపీఓ శైలజ, స్వప్న, కోఆర్డినేటర్లు హనుమంతరావు, గెస్ట్‌ఫ్యాకల్టీ మహేష్, బాష, ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ఉపయోగంలోకి తీసుకురండి

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నిర్మించిన నూతన రైతుబజార్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చి రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌ను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. కడపలో స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. కోటి రూపాయలకు పైగా వెచ్చించి నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా ఉందన్నారు.

ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్‌మీట్

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. సోమవారం ట్రిపుల్‌ఐటీలో పనిచేసే టెక్నికల్ టైగర్స్-ఆర్కేవీ రైడర్స్ జట్ల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. క్రికెట్ పోటీల్లో టెక్నికల్ టైగర్స్ జట్టు విజయం సాధించింది. పోటీల్లో పాల్గొన్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులను డైరెక్టర్, ఏఓలు అభినందించారు.

మోక్షం ఎప్పుడు..?



- ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం
- నిర్మాణాలు పూర్తయినా నిర్లక్ష్యం ఎందుకో.?
- ఈ విద్యా సంవత్సరమైనా తరగతులు మొదలవుతాయా.?

ప్రారంభానికి నోచుకోని డిగ్రీ కళాశాల, హాస్టల్ భవనాలు



పెండ్లిమర్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):అంగట్లో అన్నీ ఉన్నా...అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది.ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోక ఎప్పుడెప్పుడా అని ఎదురు చూపులు చూస్తోంది.మండలానికి 2018 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూసా (రాష్ట్రీయ ఉచ్చాతార్ శిక్షా అభియాన్) నిధుల ద్వారా 12 కోట్ల రూపాయలు డిగ్రీ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని గుట్టపై 11 ఎకరాల 25 సెంట్లు సువిశాల ప్రదేశంలో కోట్లు ఖర్చుచేసి సకల సదుపాయాలతో నిర్మాణాలను పూర్తి చేశారు. ప్రస్తుతం జూనియర్ కాలేజీలోనే డిగ్రీ కళాశాలను నడుపుతున్నారు.బీఏ,బీకామ్,బీఎస్సీ కోర్సులు ఉన్నాయి.డిగ్రీ కాలేజీలో ప్రస్తుతం 101 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల ప్రారంభమైతే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.అలాగే గ్రూపులను పెంచుకోవచ్చు.ఈ 2025-26 విద్యా సంవత్సరమైనా నూతన భవనాలలోకి వెళతామ అని విద్యార్థులు ఎదురు చూపులు చూస్తున్నారు. ఇంటర్, డిగ్రీ ఒకే చోట ఉండటంతో అక్కడ విద్యార్థులు చేరాలంటే కంజెస్టడ్‌గా ఫీల్ అవుతూ కడప,వేంపల్లె,పులివెందుల తదితర పట్టణాలకు డిగ్రీ చదివేందుకు వెళుతున్నారు. త్వరగా ప్రారంభమైతే విదార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

పొలాల్లోగుంతలు తీస్తే రైతులకు ఉపయోగం

ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుట్టల్లో గుంతలు తీయడం కంటే రైతు పొలాల్లో తీస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లె పంచాయతీ గుట్టకింద అప్పాయపల్లె గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఫారంపాండ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉన్న చోటే పని కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ ఉపాధి హామీపథకం కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 439 పంట కుంటలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా ఇవాళ 141 పంట కుంటలను ప్రారంభించినట్లు వెల్లడించారు. కమలాపురం మండలానికి 51, వల్లూరు మండలానికి 106, చెన్నూరు మండలానికి 8, సీకేదిన్నె మండలానికి 36, పెండ్లిమర్రి 92, వీఎన్‌పల్లెకు 146 పంటకుంటలు మంజూరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఎంపీడీవో జ్యోతి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీవో పార్థసారధి, కమలాపురం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

నా కుమారుడిని హత్యచేసిన వారిని శిక్షించాలి

తల్లిదండ్రుల ఆవేదన

కడప మారుతీనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని గత 2024 జనవరి 1వ తేదీన హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని వల్లూరు మండలం కొప్పోలు హరిజనవాడకు చెందిన పొట్లి గంగాదేవి, ఆమె భర్త కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక పాతరిమ్స్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తన కుమారుడిని హత్యచేసిన వారి పేర్లను వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ వారు పూర్తి స్థాయిలో విచారణ చేయలేదన్నారు. నిందితులు సాగించే అక్రమ మాదకద్రవ్యాల వ్యాపారాన్ని చూశాడనే సాకుతో ఎక్కడ బయట పెడతాడో అని మత్తుమందు ఇచ్చి వేంపల్లె గండి వద్ద హత్యచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కడప క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బు కంటే రెట్టింపు డబ్బు వసూలు చేసిన వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని దళిత ఫోరం చైర్మన్ కిశోర్ అన్నారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విశ్వనాథపురానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి లక్షా 60వేలకు గాను ఐదు లక్షల వరకు వసూలు చేశారని వడ్డీల పేరుతో వేధిస్తున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దెబ్బతిన్న అరటితోటలు



సింహాద్రిపురం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శనివారం రాత్రి వీచిన పెనుగాలుల తాకిడికి మండలంలోని జంగంరెడ్డిపల్లె గ్రామంలో అరటితోటలు నేలమట్టమయ్యాయి. గ్రామానికి చెందిన కె.ప్రతాపరెడ్డి మూడు ఎకరాలు, వి.చంద్రశేఖర్‌రెడ్డి ఐదు ఎకరాలు, కె.సర్వేశ్వరరెడ్డి రెండు ఎకరాల్లో సాగుచేసిన అరటితోటల్లో గెలలతో ఉన్న చెట్లు గాలి తాకిడికి పడిపోయయి.మండలంలో అరటితోటల ద్వారా నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్న ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు.

బ్లేడ్‌తో దాడి

పులివెందుల టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని జెండామానువీధికి చెందిన అన్వర్ బాషా అనే వ్యక్తి పై రెడ్డి బాషా అనే వ్యక్తి దాడి చేశాడని పోలీసులు తెలిపారు. పాతగొడవల కారణంగా అన్వర్ బాషాపై మనస్పర్థలు ఉన్నాయని ఈ క్రమంలోనే సోమవారం రాత్రి అన్వర్‌బాషాను బ్లేడ్‌తీసుకుని చెవికోసేందుకు రెడ్డి బాషా ప్రయత్నించగా తలకు గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'సతీష్‌రెడ్డిపై ఆరోపించే అర్హత లేదు'

పులివెందుల టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి మీద ఆరోపణలు చేసే అర్హత రాంగోపాల్‌రెడ్డికి లేదని వైసీపీ నాయకుడు నంద్యాల హేమాద్రిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సతీష్‌రెడ్డి 1999 నుంచి 2019 వరకు ఏ రోజు కూడా టీడీపీ టికెట్ కావాలని కోరలేదని, టీడీపీ అధిష్టానం గుర్తించి ఇచ్చిందన్నారు. సతీష్‌రెడ్డి గురించి విమర్శలు చేసే ముందు నీ గురించి తెలుసుకుంటే మంచిదన్నారు.

వైద్యమిత్రలను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించండి



నిరసన చేస్తున్న వైద్యమిత్రలు

కడప కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న వైద్య మిత్రలను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి సుబ్బరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా న్యాయమైన డిమాండ్ల సాధనకోసంగా ఈనెల 27న విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ప్రధాన కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు బబిత, కవిత, నాగరత్న, ప్రవల్లిక, నాగార్జునరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్లేట్ కవర్‌తో పందులు పరుగో..పరుగు

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు పందుల భారీనుంచి వాటిని రక్షించుకునేందుకు రాత్రుల్లు మేలుకొని శబ్దాలు చేయాల్సి వస్తోంది. దీంతో ఉదయాన్నే పొలం పనులకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతుండేవారు. దీంతో రైతులు హోటల్‌లో, పెళ్లిళ్లకు టేబుల్‌పై అల్యూమినియం కవర్లు పొలం వెంబడి వైరుకు కట్టి వేలాడదీశారు. దీంతో పందులు అటువైపు వచ్చినప్పుడు కవర్లు గాలికి గలగల శబ్దం వస్తుండడంతో పారిపోతున్నాయి. చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె పంచాయతీ బలిజపల్లెలో రైతులకు వచ్చిన ఆలోచన పలువురిని ఆకర్షించింది.



క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి కృషిచేయాలి



వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

వేంపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీకుమార్‌రెడ్డి, వేంపల్లె సీహెచ్‌సీ వైద్యుడు వైద్యనాథ్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం,హెచ్‌ఈషఫిఉన్నీసా, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చెన్నూరు..: మండలాన్ని క్షయరహిత మండలంగా మార్చేందుకు వైద్య ఆరోగ్యసిబ్బంది కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవ సందర్భంగా పీహెచ్‌సీ వైద్య ఆరోగ్యసిబ్బందితో పాటు ఆర్‌హెచ్‌సీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం 2030 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిస్తామని స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుబ్బారావు, చందన, పీహెచ్‌సీ, ఆర్‌హెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు టోల్‌గేటు వేలం పాట

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న కొలుములపల్లె గుట్టరాళ్ల టోల్‌గేటు వేలంపాటను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు కొలుములపల్లె గ్రామ పంచాయతీ పేరుమీద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.50 వేలు డీడీ లేదా నగదు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. హెచ్చు పాటదారుడు మిగిలిన మొత్తం డబ్బులు చెల్లించాలన్నారు. వేలం పాటకు సంబంధించిన సర్వ హక్కులు పంచాయతీకి చెందుతాయన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెండ్లిమర్రి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి అలాగే 7,8,9 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సుజాత తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్సీలో మంగళవారం మాట్లాడుతూ ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. అనాథలు,బడిబయటి పిల్లలు, బడి మానేసిన వారు,పేద ఎస్సీఎస్టీబీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులు అని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు మాత్రమే అడ్మిషన్‌కు పరిగణించి ఎంపికైన బాలికలకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయండి

కడప కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానంలో 9వ తేదీన జరిగే సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కడప అపోస్తలిక పాలనాధికారి బిషప్ గాలి బాలి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బిషప్ హౌస్‌లో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 30 మంది బిషప్‌లు హాజరుకానున్నారన్నారు. జిల్లాలోని కథోలిక విశ్వాసులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఫాదర్లు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

గేట్‌లో అన్నమాచార్య విద్యార్థిని ప్రతిభ



పావని

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గేట్‌లో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి పి.పావని గేట్-2025 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అన్నమాచార్య కళాశాలలో చదువుతున్న విద్యార్థిని దేశవ్యాప్తంగా ఏడు లక్షల మంది ఈ పరీక్ష రాయగా 439వ ర్యాంకు సాధించి కళాశాలకు పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చిందని విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి శ్రీచందన, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఏవో రామసుబ్బారెడ్డి, విద్యార్థినిని అభినందించారు.

సీకేదిన్నె ఎంఈవో-1గా పి.సుజాత

సీకేదిన్నె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె ఎంఈవో-1గా పి.సుజాతను ఆర్‌జేడీ నియమించారు. దీంతో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో సుజాతకు ఎంఈవో-2 రమాదేవి, పీఆర్‌టీయూ కన్వీనర్ తిరుపాల్, కౌన్సిలర్ శ్రీనివాసులు, తదితరులు స్వాగతం పలికారు. నూతన ఎంఈవో మాట్లాడుతూ మండలంలో ఉన్న ఉపాధ్యాయుల సహాయ సహకారాలు తీసుకుని అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ధోబీఘాట్‌కు కంచె ఏర్పాటుచేయాలి

కడప మారుతీనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని గత 1994లో నాటి ప్రభుత్వం నగర రామాంజనేయపురంలో దాదాపు 100 రజక కుటుంబాలకు కేటాయించిన 3 ఎకరాల స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటు చేయాలని రజక సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షుడు మచ్చయ్యగారి మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు రజక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడును కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

కడప ఎర్రముక్కపల్లె,మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధికారులుపాల్గొన్నారు.

30న అమ్మవారిశాలలో పంచాంగ శ్రవణం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు అమ్మవారిశాలలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వర్ధమాన గాయకుడు సాకేతు, శ్రీవైష్ణవిలతో భక్తిసంగీత కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

నత్తనడకన విస్తరణ పనులు



● తొమ్మిది నెలలుగా ముందుకు సాగని వైనం ● గడువులోగా పూర్తిచేస్తారో లేదోనంటున్న జనం

ముద్దనూరు మార్చి24(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చేద్దామా? వద్దా? అన్నట్లు కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వివరాల్లోకి వెళితే...ముద్దనూరు పట్టణంలో జాతీయ రహదారుల శాఖా వారు రోడ్డు విస్తర్ణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ, మంచినీటి పైపు లైను, విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేసి తర్వాత రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉంది. రూ.8కోట్లతో టెండర్లు పూర్తియినా కాంట్రాక్టర్ పనులు ఆలస్యంగా మొదలు పెట్టి 9నెల ల గడువు కాలంలో ఇప్పటికే దాదాపు 5నెలలు పూర్తయింది. మిగిలిన 4నెలల సమయంలో .దాదాపు 2కిలో మీటర్ల రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ, మంచినీటి పైపు లైను, విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఒక్క ఎక్స్‌కవేటర్‌తోపాటు రెండు ట్రాక్టర్లతో పనులు చేస్తున్నారు. ఇలా పనులు చేస్తే నాలుగు నెలలు కాదు కదా ఏడాదైనా ఇలాగే ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా ఇక్కడ పనులు నత్తనడక జరిగితే ఈ ప్రాంత ప్రజలు ఎక్కువ నెలలు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందంటున్నారు. ఇప్పటికే రోడ్డు కొలతల్లో అవకతవకలు జరిగాయని కొందరు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్డు పనులు సత్వరం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో పనులు పూర్తి చేస్తాం

పనులు ఆలస్యంగా మొదలు పెట్టడం వాస్తవమే.పనులు పూర్తి చేసేందుకు నాలుగు నెలలు గడువు ఉండడంతో విస్తరణ పనులు నిలిపే ప్రసక్తి ఉండదు. భారీ యంత్రాలను ఉపయోగించి ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా పనులు సకాలంలో పూర్తి చేస్తాం.

-విశ్వనాథ్, జాతీయ రహదారి ఏఈ

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

మైదుకూరు రూరల్ ,మార్చి24(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్ జరుగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా పోలీసులకు సూచించినట్లు తెలిపారు.

క్రికెట్ బుకీ అరెస్టు.. రూ.5,200 నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు , మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా సెల్ ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న శంకరాపురంకు చెందిన మోపూరి శివానందరెడ్డిని అరెస్టు చేసి అతని వద్దనుంచి సెల్ ఫోన్ తో పాటు రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రెండవ రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. శివానంద రెడ్డి పై గేమింగ్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని ముగ్గురు క్రికెట్ బుకీలకు రూరల్ ఎస్ఐ రఫీ కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత కేసుల ఆధారంగా స్టేషనకు పిలిపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో వైసీపీ నాయకుడు దొరసానిపల్లెకు చెందిన పాతకోట బలరామిరెడ్డితో కామనూరుకు చెందిన సుధీర్‌రెడ్డి అమృతనగర్‌కు చెందిన సుధాకర్ ఉన్నారు. మరో 19 మంది పాత క్రికెట్ బుకీలపై బైండోవర్ చేయమని జిల్లా ఎస్పీ నుంచి ఆదేశాలొచ్చాయని ఎస్ఐ రఫీ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

రాజుపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టంగుటూరు కు చెందిన ఆరుగురు జూదర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ అన్నారు. గ్రామానికి దక్షిణాన ఉన్న కంపచెట్ల వద్ద జూదం ఆడుతుండగా వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9120 సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు క్రాంతి, ఉదయభాస్కర్, నాయక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయండి

పోరుమామిళ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ వ్యవస్థను పంచాయతీ అధికారులు బాగు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సోమ వారం మహబూబ్ నగర్‌కాలనీలో పర్యటించి మాట్లాడుతూ మహబూబ్‌న గర్‌కాలనీలో డ్రైనేజీ కాల్వలేవని వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఈ వీధుల్లో డ్రైనేజీ కాల్వలను మరమ్మత్తులు చేసి అంటురోగాలు ప్రబలకుండా చూడాలని అధికారులను కోరారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలని ధర్నా

మైదుకూరు రూరల్ , మార్చి24(ఆంధ్రజ్యోతి) : స్థానిక వనిపెంట రోడ్డులోని సంక్షేమ హాస్టల్ ఎదురుగా ఉన్న సుందరయ్య కాలనీలో ఇంటి పట్టాలు ఇవ్వాలని స్థానికులు ధర్నా చేశారు.కాలనీలో గత తొమ్మిదేళ్లుగా నివాసం ఉంటున్నా ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షరీఫ్, బీబీ, సుధాకర్, ఇమామ్, లక్ష్మిదేవి, పోలయ్య పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కాశినాయన మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 11 వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12 తరగతుల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. పూర్తివివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించవచ్చునన్నారు.

లీకేజీ నీటిని వెంటనే అరికట్టండి



దువ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వీదుల్లో వెళ్లే పైపులైను లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. నీరు వదిలిన సమయంలో గుంత నిండటం, ఆ తర్వాత నీరు పైపులైనులోకి వెళ్లి కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి లీకేజీ నీటిని అరికట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పూజా పాఠశాలలో విచారణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చౌడూరులోని పూజా ఇంటర్నేషనల్ స్కూలులో విద్యార్థిపై చేయి చేసుకున్న సంఘటనపై ఎంఈవో సావిత్రమ్మ విచారణ జరిపారు. పాఠశాలకు చెందిన 8 తరగతి విద్యార్థి మూలే సాత్వికరెడ్డిని డీన్ కొట్టడంతో గాయాలు అయ్యాయి. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో సోమవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల సీఈవో సబిత విద్యార్థులను విచారించారు. కాగా ఆ విద్యార్థి కొందరు అమ్మాయిలను వేదింపులకు గురిచేశాడని, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోలేదని సీఈవో సబిత తెలిపారు. సంఘటనపై డీఈవోకు నివేదిక పంపుతామని ఎంఈవో తెలిపారు.

క్షయవ్యాధి అంతం.. మానవాళి పంతం కావాలి

ప్రొద్దుటూరు , మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి అంతం మానవాళి అంతటికి పంతంకావాలని జిల్లా ఉపవైద్యశాఖాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా ఆసుపత్రి నుంచి ర్యాలీని సూపరిండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు ప్రారంభించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం 6 నెలలు మందులు ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ వ్యాధి పూర్తిగా నయమగువరకు మందులు వాడాలన్నారు. మందులు ఆశవర్కర్ ద్వారా నేరుగా ఇంటికే వచ్చి అందజేస్తారన్నారు. చికిత్స సమయంలో నెలకు 1000 రూపాయలు పోషకాహారం కోసం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీ డాక్టర్స్ ఆసిఫ్, సూర్యనాగలక్ష్మీ, నర్సింగ్ సూపరిండెంట్ రాణెమ్మ, డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్ హెడ్యుకేటర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు,

బద్వేలులో: భారతదేశాన్ని క్షయవ్యాధి లేని దేశంగా మారుద్దామని ఇందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని తొట్లిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి వినయ్‌కుమార్ , డిప్యూటి సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాలీలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఎస్‌టీఎల్ఎస్ బ్రహ్మనందరెడ్డి, ఆశాలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: క్షయవ్యాధిగ్రస్తులను ఆదరించాలని వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సుల్తానా పేర్కొన్నారు. సోమవారం క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సిబ్బంది లావణ్య, లక్ష్మి, సుప్రజ, ప్రశాంతి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి శాశ్వత కల్యాణోత్సవానికి విరాళాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ప్రతి నెలా వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబల కల్యాణోత్సవానికి కొందరు శాశ్వత విరాళాలు అందజేశారు. దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిని మాబుషరీఫ్, రేష్మి దంపతులు రూ.1,00,116లను దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీకి అందించారు. అలాగే అర్కటవేముల గ్రామానికి చెందిన రాచంరెడ్డి లక్ష్మినారాయణరెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతులు రూ.1,00,150 నగదు అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మేనేజరు ఈశ్వరయాచారి, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13 కు మార్పు

కొండాపురం. మార్చి 24 (ఆంధ్రజ్యోతి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఏప్రిల్ 6 న జరగాల్సిన ప్రవేశపరీక్షను ప్రభుత్వం ఏప్రిల్ 13 వ తేదీకి మార్పు చేసినట్లు కొండాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఏప్రిల్ 6 న శ్రీరామనవమి పండుగ ఉన్నందున ఏప్రిల్ 13 కు మార్చినట్లు తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో 5 వతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ విషయం గమనించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నిబంధనల మేరకే యాష్ రవాణా చేయాలి

ఎర్రగుంట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి):నిబంధనలమేరకే బూడిదను టిప్పర్లలో రవాణా చేయాలని కలమల్ల ఎస్ఐ తిమోతి ట్రాన్స్‌పోర్టర్స్‌ను ఆదేశించారు. టిప్పర్లలో రవాణా చేస్తున్న బూడిద రోడ్ల వెంబడి కారుతోందని, దాని వల్ల తీవ్ర దుమ్ము వస్తోందని గత వారంలో కలమల్ల వాసులు ధర్నా చేయడం తోపాటు, ఎస్ఐకి వినతిపత్రాన్ని కూడా ఇచ్చారు. దీంతో ఎస్ఐ ట్రాన్స్‌పోర్టర్స్‌ను, ప్రజలను పిలిపించి సోమవారం మాట్లాడారు. బూడిద వాహనాల వల్ల కలిగే సమస్యల్ని నివారించేందుకు జాగ్రత్తలు పాటించాలన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించండి

బి.కోడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని పశువులు, దూడలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి భరద్వాజ క్రిష్ణ పాడిరైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశువైద్య సిబ్బంది వచ్చి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తారని పాడి రైతులు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఖాజీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నష్టాలతో 19వ తేదీన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ మేరకు తహసీల్దారు మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన పత్తి రామచంద్రారెడ్డి గత మూడు సంవత్సరాలుగా సాగు చేసిన పంటలు రాకపోవడంతో అప్పుల ఊబిలో చిక్కుకున్నాడ న్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉండడంతో ప్రభుత్వమే వారిని ఆదుకుని కాపాడాలన్నారు. రైతు సేవా సమితి జిల్లా సభ్యుడు రామాంజనేయరెడ్డి, రైతులు బాలగంగిరెడ్డి, నరసింహ, ఓబులేసు, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ మహిళలకు ప్రయోజనకరం

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):శక్తియాప్ వలన మహిళలకు ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ప్రోగ్రాం పోలీసు అధికారి వెంకట నరసింహులు సూచించారు. సోమవారం జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ . శక్తియాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ప్రయోజనాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, పీడీ షఫీ, సుధీర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మహిళా పోలీసులు టీం సభ్యులు, మహిళలు మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు తెలిపారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌తో క్యాన్సర్-వినియోగం తగ్గించాలి అన్న అంశంపై పెద్దశెట్టిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నోడల్ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పనులు చేసుకోవాలి

ముద్దనూరు మార్చి24(ఆంధ్రజ్యోతి):ఒకే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు కలిసి కట్టుగా పనులు చేసుకోవాలని తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి సూచించారు.స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆరోపనలు చేసుకున్న వీఆర్వో చందన,సెక్రటరీ మౌలానకు తహసీల్దారు పలు సూచనలు చేశారు. అంకిత భావంతో పనులు నిర్వర్తించాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న బీసీ నేత కొండయ్య

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించి పరిష్కరించాలని జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు జొల్లు కొండయ్య, తదితర నాయకులు ఆర్డీవో సాయిశ్రీకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ జనాభాలో 50 శాతంపైగా బీసీలు, 60 శాతం బీసీ ఉపకులాలు ఉండగా వారిలో 70 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఉండే విధంగా శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కాట రామదాసు, కోశాధికారి వెంకోబారావు, వాల్మీకి సంఘం నాయకులు పెద్ద కంబయ్య పాల్గొన్నారు. కాగాఈ మైలవరం మండలం చిన్నవెంతుర్ల గ్రామంలో పీర్లమాన్యం ఇనాం భూమి 4.70 ఎకరాలు కబ్జా చేశారని గూడుబాయిగారి చిన్నమౌలాలి అందజేసిన వినతిపత్రంలో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారని తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సైదున్నీసా, ఉపాధి హామీ అధికారిణి పద్మ అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు పన్నుల పెంపు ప్రతిపాదన వద్దు

●మున్సిపల్ సమావేశంలో వైస్ చైర్మన్ల డిమాండ్

ప్రొద్దుటూరు ,మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోవున్న దుకాణాలకు మున్సిపాలిటీ ఇచ్చే ట్రెడ్ లైసెన్సు ఫీజులు 50 శాతం మేర పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు బంగారు మునిరెడ్డి, ఖాజాలు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ జనసేన కాంగ్రెస్ కౌన్సిల్లర్లంతా గైర్హాజరయ్యారు. కేవలం వైసీపీ కౌన్సిల్లర్లు మాత్రమే సభను నడుపుకున్నారు. వైస్ చైర్మన్ ఖాజా మాట్లాడుతూ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో గేట్ రేట్లను పెంపుదల చేయడంతో అక్కడ వ్యాపారులకు అధికభారం పడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా వ్యాపారులకు ఎలాంటి భారం లేకుండా ఫ్రీగేట్‌ను పెట్టే అంశాన్ని పరిశీలించాలన్నారు. మరో వైస్ చైర్మన్ బంగారురెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో తీసుకున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు వారిని మార్చి తరువాత కూడా కొనసాగించాలన్నారు. మున్సిపల్ డిలిగేట్ కమిషనర్ డీఈ దస్తగిరి సభ్యుల ప్రశ్నలకు సమాదానాలు ఇచ్చారు.

టీడీపీ ప్రభుత్వంలో అవినీతికి తావులేదు : ఎమ్మెల్యే



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యాలతో ఆర్థికంగా దెబ్బతిన్న కుటుంబాలను ఆదుకోవడానికి టీడీపీ ప్రభు త్వంలో అవినీతి రహితంగా సీఎం సహా యనిధి ద్వారా ఆర్థిక సహాయం అందు తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 107 మందికి 82,04,190 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి కింద అందించే చెక్కులకు ఎవరికి ఎలాంటికమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అలా ఎవరైనా చేసినట్లయితే తన దృష్టికి తెవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు , 33 వార్డు కుతుబుద్దీన్, 39 వార్డు సిద్దయ్య, 30 వార్డు చంద్రా, 34 వార్డు పోసా భాస్కర్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సొంత భవనాలు లేకున్నా అటానమస్ ఎలా ఇచ్చారు



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు , మార్చి 24 (ఆంధ్రజ్యోతి) సొంత భవనాలు లేకున్నా ఎరికలయ్య గీతా ఆశ్రమంలో నెలనెల అద్దె చెల్లిస్తున్న వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు ఏవిధంగా ఇస్తారని విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారుకార్యాలయం వద్ద వెంకటేశ్వర డిగ్రీకళాశాల అక్రమాలపై విచారణ జరిపి కళాశాల గుర్తింపురద్దుచేయాలని విద్యార్థి యువజన సంఘాలు ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు ఓబులేసు గడ్డం నరసిం హులు జగన్‌లు మాట్లాడుతూ వెంకట్వేర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌పై నకిలీ అగ్రిమెంట్లు పుట్టించిన దాంతో టూటౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదైందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బయన్న, ప్రతాప్, హరి , కాలే, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలపై అసత్యప్రచారం తగదు



మాట్లాడుతున్న హరినారాయణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గీతాశ్రమంలో ఎస్వీ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదాపై అసత్య ప్రచారం చేయడం తగదని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.హరినారాయణ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈబీసీ నుంచి 2 (ఎఫ్), 12(బి) గుర్తింపు లభించిందన్నారు. మెరుగైన విద్యాప్రమాణాలు ఉండడం వలనే న్యాక్ బి++ గుర్తింపు వచ్చిందన్నారు. న్యాక్ గుర్తింపు వలన యూజీసీ నుంచి అటామస్ హోదా లభించిందని అన్ని నిబంధనల మేరకే తమకు న్యాక్, అటానమస్ హోదా లభించిందని పేర్కొన్నారు. కళాశాల అడ్మిషన్ల సమయంలోనే కొందరు తమ కళాశాలపై దురుద్దేశాలు అపాదిస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే చైతన్య యాత్రలు

బద్వేలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్వేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈనెల 20తేది నుంచి 30వ తేదీ వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నదన్నారు. పట్టణంలో 25వ తేదినుంచి 30వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో నిర్వహించే ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పార్టీ పట్టణ కార్యదర్శి కె.శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్ షరీఫ్. అనంతమ్మ, మోక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డీవీఎస్ఆర్ క్రిష్ణ

బద్వేలు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డీవీఎస్ఆర్ క్రిష్ణ, ఉపాధ్యక్షుడిగా కె.రవిచంద్రలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డీవీ శివరామక్రిష్ణ, ఉపాధ్యక్షుడుగా కె.రవిచంద్ర నామినేషన్ వేయగా వారికి పోటీగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతోవారిరువురినీ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని రాయితీలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన బార్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

జమ్మలమడుగు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నగర పంచాయతీ కమిషనర్ కె.వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన తమను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. గతంలో సుమారు 15 సంవత్సరాల నుంచి వాటర్ ట్యాక్స్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. దీంతో వారి ఇళ్ల వద్దకు వెళ్లి తప్పనిసరిగా బిల్లులు చెల్లించాలని అడుగడం జరిగిందన్నారు. కొందరు పేదలైనా వాటర్ పన్నులు చెల్లిస్తున్నారన్నారు. అయితే వ్యాపారాలు చేస్తున్న వారే సకాలంలో పన్నులు చెల్లించలేదన్నారు. కొందరు రూ.20 నుంచి రూ.30 వేలు బాకీ ఉన్నా రూ.2 వేలు కట్టినా కట్టించుకున్నామని ఎక్కడా పేదలకు తాము ఇబ్బంది కలిగించలేదన్నారు. ఇప్పటికి బిల్లులు చెల్లించని వారు కొందరు రాజకీయ నేతల పేర్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటివేమీ ఉండదని ఎవరైనా పన్నులు చెల్లించాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తున్నట్లుగా తెలుస్తోంది.